క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం చిట్కుల్ సబ్‌స్టేషన్ మరమతుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిట్కుల్ గ్రామంతో పాటు కాలనీలో, ముత్తంగి పరిధిలోని సాయిప్రియ, విజేత, రామ్‌రాజ్ నగర్ కాలనీలో, ఇస్నాపూర్ ఆంధ్ర కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ మోహన్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జహీరాబాద్ పట్టణంలో..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రాంతంలో శనివారం కరెంట్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఏ మధుసూదన్, రూరల్ ఏఈ జగదీశ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అల్గల్, రంజోల్ చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపేస్తున్నామని చెప్పారు. దీంతో హెగ్గెల్లి, ఎల్గోయి, దిడిగి, రంజోల్, కోత్తూర్(బి), బాబానగర్, హుగ్గెల్లి తండా ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

గుంతల రోడ్డుతో ఇక్కట్లు



బొబ్బిలికుంటపై బురద గుంతలు

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి పట్టణంలోని బొబ్బిలి కుంట పరిసరాలు దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. వర్షం కురిసినప్పుడు చెరువు కట్ట బురదమయంగా మారుతోంది. శాంతినగర్ నుంచి ముగ్ధం నగర్ వరకు ప్రజలు రాకపోకలు సాగిస్తారు. కట్ట బురదమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు వాహనాలు బురదలో జారిపోవడంతో అదుపుతప్పి కింద పడి గాయపడుతున్నారు. అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ పుష్పనగేశ్ పర్యటించారు. డ్రైనేజీ సమస్యను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు తెలియజేశామన్నారు. నిత్యం డివిజన్ పరిధిలోని కాలనీల్లో పర్యటించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నాని తెలిపారు.

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలరెడ్డిని కలిసిన కార్పొరేటర్

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలరెడ్డిని కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు మవీన్ గౌడ్, పీటర్, సతీష్ పాల్గొన్నారు.

విలీన గ్రామాలపై చిన్నచూపు తగదు

జహీరాబాద్ టౌన్: మున్సిపల్‌లో విలీనమైన గ్రామ పంచాయతీలపై మున్సిపల్ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని సీపీఎం నియోజకవర్గం కార్యదర్శి మహిపాల్ ఆరోపించారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీపీఎం నాయకులు విలీన గ్రామాలైన అల్లీపూర్, పస్తాపూర్, హోతి(కె) పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల ద్వారా సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ విలీన గ్రామాల్లో మౌలిక వసతులు కరువయ్యాయని అన్నారు. మురికి కాలువలు, సీసీ రోడ్లు వేయడంలేదన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి విలీన పంచాయతీ గ్రామాల్లో మురికి కాలువలు, సీసీ రోడ్లు వేయాలని కోరారు.

పోలీసుల తనిఖీలు

నారాయణఖేడ్: వ్యవసాయ క్షేత్రాల్లో గంజాయి సాగు జరగకుండా ఉండేందుకు నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి మనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని మాయికోడ్, రాణాపూర్, రాణాపూర్ తండా, తుమ్మూర్, బోరంచతో పాటు పలు గ్రామాల్లో పత్తి, సోయా తదితర సాగు చేసిన పంట భూములను పరిశీలించారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా చట్టప్రకారం నేరం అని, కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కొత్త చట్టం ప్రకారం గంజాయి సాగు చేస్తే భూమి ప్రభుత్వానికి జప్తు చేస్తామన్నారు. గంజాయి సాగుచేసిన వారి వివరాలు తెలియజేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

మురికి కాల్వలు నిర్మించండి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని పలు గ్రామాల్లో మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు శుక్రవారం మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్‌కు విన్నవించారు. ప్రత్యేకాధికారి మండలంలోని తడ్కల్, చాప్టా(కే), బాన్సువాడ, కంగ్టి గ్రామాల్లోని వీధులు తిరిగి పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలు, పాఠశాలలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పలు నిర్మాణాలు, పైపులైన్‌ల లీకేజీలు తదితర అంశాలు పరిశీలించారు. ఎంపీడీఓ సత్తయ్య, పంచాయతీ సెక్రటరీలు సుభాష్ పాల్గొన్నారు.

వానొస్తే నరకమే..

జహీరాబాద్-బీదర్ బైపాస్ రోడ్డు అధ్వానం

- నిలిచిన బ్రిడ్జి పనులతో తప్పని అవస్థలు
- నిధులు మంజూరైనా సాగని పనులు
- పట్టించుకోని అధికారులు



వర్షం నీటితో ప్రమాదకరంగా మారిన రోడ్డు (ఫైల్)

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్-బీదర్ బైపాస్ రోడ్డు అధ్వానంగా మారింది. మరోవైపు ఈదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. వానొస్తే ఈదారి అంతా మడుగులను తలపిస్తుంటుంది. దీంతో ప్రజలు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ప్రజలు నరకం చూస్తున్నారు. వర్షకాలం ప్రారంభం లోపు బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇంకా అసంపూర్తిగానే ఉంది. ఈదారి గుండా కర్నాటక రాష్ట్రంలోని బీదర్‌తో పాటు న్యాల్‌కల్, మిర్జాపూర్, గంగ్వార్, దిడ్గి, కొత్తూర్(బి), అల్గోల్, భరత్‌నగర్, ఎల్గోయి, పాట్‌పల్లి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

కొద్దిపాటి చినుకులు పడినా..

రోడ్డు మధ్య నుంచి పెద్ద వాగు ప్రవహిస్తుంటుంది. వానాకాలంలో ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయడం కష్టమవుతుంది. కొద్దిపాటి చినుకులు పడితే చాలు చిత్తడిచిత్తడిగా మారుతుంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడడం వల్ల వర్షం నీరు చేరి ఎక్కడ గొయ్యి ఉందో అన్న విషయం తెలియడం లేదు. దీంతో వాహన చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన అర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 33 లక్షలు మంజూరు చేయించారు. గత సంవత్సరం కాంట్రాక్టర్ వంతెన పనులను ప్రారంభించారు. ప్రారంభం నుంచే నిర్మాణం పనులు నత్తనడక నడుస్తున్నాయి. 70 శాతం పనులు పూర్తి అయిన తరువాత అర్ధరంతరంగా ఆగిపోయాయి. చేసేదిలేక ప్రజలు దెబ్బతిన్న రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తున్నారు.



నిలిచిన బ్రిడ్జి పనులు

శ్రమదానంతో గుంతలు పూడ్చివేత

బ్రిడ్జి పనులు ఆగిపోవడం వల్ల దెబ్బతిన్న రోడ్డుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కాంగ్రెస్ నాయకులు శ్రమదానంతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. దాతల సహకారంతో అర కిలోమీటరు పొడవు రోడ్డుపై పడిన గుంతల్లో కంకర వేసి పూడ్చివేయించారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని అర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆగిన బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభింపజేసి పూర్తి చేయిస్తామని చెప్పారు.

మాసాన్‌పల్లిలో బోనాలు



మాసాన్‌పల్లిలో బోనాలతో వస్తున్న మహిళలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మాసాన్‌పల్లిలో శుక్రవారం బోనాలు పండుగ నిర్వహించారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఐకేపీ కార్యాలయంలో చీమల దండు..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం గండు చీమలు వచ్చాయి. ఉదయం కార్యాలయాన్ని తెరవగా కార్యాలయంలో ఎక్కడ చూసినా గండు చీమల దండు కనిపించింది. కార్యాలయాన్ని శుభ్రం చేసే పని మనిషి వాటిని తొలగించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. చీపుర్లతో ఎన్ని సార్లు ఊడ్చి బయట పారేసిన మళ్లీ వస్తుండడంతో కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యాలయంలోకి వచ్చిన సిబ్బంది అవి కరవడంతో చేసేది లేక చాలా సేపు బయటే తమ పనులు చేసుకోవడం కనిపించింది.

ప్రజలకు సేవలందించి పేరు తెచ్చుకోవాలి



న్యాల్‌కల్‌లో మాట్లాడుతున్న సాబేర్ హుస్సేన్

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని జహీరాబాద్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ హుస్సేన్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎంపీపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను శుక్రవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్యక్రమాల విజయవంతానికి తమ వంతు కృషి చేయాలన్నారు. ఉత్తమ సేవలందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్, రమాకాంత్, నాగభూషణం, నర్సింహులు, రవీందర్, గాయత్రి, శిల్పా, జ్యోతిర్మయి, శోభారాణి, ఈశ్వర్, సునీల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: అడ్డమీద పనికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన నరేష్ అతని భార్య మంజుల ఇరువురు కలిసి ఏడాది క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో జులై 28వ తేదీన అడ్డమీద కూలి పనికి వెళ్లివస్తానని ఇంటి నుండి వెళ్లిన నరేష్ తిరిగి రాలేదు. దీంతో ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలుగు పోచమ్మ ఆలయ ఈఓగా జీవదానం

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం షేర్ ఖాన్ పల్లి శివారులోని పలుకుమీది నల్ల పోచమ్మ ఆలయ ఈఓగా జీవదానంను దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో పాత ఈఓ చంద్రశేఖర్‌తో కలిసి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని నిరసన

జహీరాబాద్ టౌన్: పట్టాపాస్ పుస్తకాల కోసం కోహీర్ మండలంలోని మాచిరెడ్డి పల్లి రైతులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ.. కోహీర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామంలోని 81 సర్వే నంబర్‌లో ఎస్సీ, బీసీలకు సంబంధించిన భూములు ఉన్నాయన్నారు. పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు ధరణి వచ్చినప్పటి నుంచి పాస్‌పుస్తకాలు ఇవ్వలేదన్నారు. రైతులు పంటలు సాగు చేసుకోవడం లేదని తహసీల్దార్, ఆర్ఐలు ఆర్డీఓకు రిపోర్టు పంపడం అన్యాయమన్నారు. రైతులు పొజిషన్‌లో ఉండగా, లేరని రిపోర్టు పంపిన తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. తప్పుడు నివేదిక ఇచ్చిన తహసీల్దార్‌పై కలెక్టర్‌తోపాటు సీసీఏకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆర్డీఓ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, రవీందర్, చంద్రయ్య, దేవయ్య, రాములు, రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్మానంపై హర్షం

పటాన్‌చెరు: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు జిన్నారంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, వైస్ ఎంపీపీ గంగ రమేశ్, మాజీ ఎంపీటీసీ జనాబాయ్, సీనియర్ నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్గీకరణపై హర్షం

నారాయణఖేడ్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ల ఆమోదానికి మద్దతు పలికినందుకు శుక్రవారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కాంగ్రెస్ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్, జుక్కల్ ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, లక్ష్మీకాంతరావు చిత్రపటాల ఫ్లెక్సీకి క్షీరాభిషకం చేశారు. ముఖ్యమంత్రికి డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, ఎస్సీసెల్ నాయకులు జైరాజ్, కృష్ణ, అమృత్, శ్రీకాంత్, సాయిలు, స్వామిదాస్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు

పటాన్‌చెరు టౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పట్లోళ్ల వెంకటేష్ మాదిగ అన్నారు. శుక్రవారం పటాన్ చెరు అంబేడ్కర్ చౌరస్తా వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, దప్పు యాదయ్య, నీరుడి రఘు, బాలేష్, నటరాజ్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బండరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు

జహీరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తూ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి. శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రాంల విగ్రహాలకు పూలమాలలు వేసి సంబరాలు జరుపుకొన్నారు. 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో జరుగుతున్న పోరాట ఫలితమే అన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఐకి సన్మానం

న్యాల్‌కల్ (జహీరాబాద్): జహీరాబాద్ రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన హన్మంత్‌ను శుక్రవారం మాజీ సర్పంచ్‌లు రాజ్‌కుమార్, అమీర్, మల్‌రెడ్డి, మారుతి యాదవ్ తదితరులు మర్యాద పూర్వంగా కలిసి ఆయనను సన్మానించారు.

◆ బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవీందర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అభిస్తుందని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాట వేస్తామని చెప్పారు.

◆ ఉచిత పాసులు ఇవ్వాలి

మునిపల్లి(అందోల్): టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల దూరం ఉన్న వాహనదారులకు ఉచిత పాసులు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోదావరి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కంకోల్ శివారు 65వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా మేనేజర్‌కు బీజేపా నాయకులు వినతి పత్రం అందజేశారు. 20 కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాల వాహనదారులకు ఉచితంగా పాసులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉపేందర్, అయ్యప్పస్వామి, నాగిరెట్టి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

◆ 13న సదరం శిబిరం

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 13వ తేదీన సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీదేవి శుక్రవారం తెలిపారు. శిబిరానికి సంబంధించిన స్లాట్స్ ఈనెల 6వ తేదీన విడుదల చేస్తామన్నారు. ఈ శిబిరంలో పాల్గొనే వికలాంగులు మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు.

◆ ఖేడ్ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉమా మహేశ్వర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా ఏడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న కళింగ కృష్ణకుమార్ జిన్నారం జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఉమామహేశ్వర్‌రావును నియమించారు. కృష్ణకుమార్ కళాశాలను కార్పొరేట్ కళాశాల స్థాయిలో తీర్చిదిద్దారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు.

◆ సన్మానం

రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన బాలకృష్ణారెడ్డిని మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు, యువజన సంఘాల నాయకులు సన్మానించారు. నిబద్ధతతో విధులు నిర్వహించి తమ గ్రామ అభివృద్ధిలో బాగస్వాములైన బాలకృష్ణారెడ్డి సేవలు గుర్తుండిపోతాయన్నారు.

◆ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం కొడిప్యాక గ్రామంలో వెల్‌నెస్ హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్య శిబిరంలో ఈసీజీ, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి ప్రతినిధులు శివరామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు అఖిల, రఫీ, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ హెల్ప్‌లైన్‌పై అవగాహన ఉండాలి

పటాన్‌చెరు: షీ టీమ్, సైబర్ క్రైమ్‌తోపాటు హెల్ప్‌లైన్‌పై అవగాహన ఉండాలని జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మీ అన్నారు. శుక్రవారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో, మిషన్ శక్తి సంకల్ప్ కింద వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా జిన్నారం పరిధి నల్తూర్ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు, షీటీమ్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, సఖి సేవలు, చైల్డ్ లైన్ సేవలు, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నివారణ, ఆరోగ్యం పోషకాహారం, హెల్ప్ లైన్ నంబర్లు (1098,100, 181,112,1930) గురించి వివరించారు. మెడికల్ ఆఫీసర్ కోమలి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, గ్రామ పంచాయతీ సెక్రటరీ రానా కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

◆ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): అర్హులైన ప్రతి రైతు భీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని వనంపల్లి గ్రామంలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం,, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్, రైతుభీమా అప్లికేషన్ ఫారం తో పాటు స్వయంగా రైతు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుకుమార్, రైతులు నవీన్ పటేల్, యేసయ్య నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరం సమావేశం

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేటలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఫోరం మొదటి సాధారణ సమావేశం జరిగింది. సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్‌యాదవ్, ట్రెజరర్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, కమిషనర్ తాజ్‌మోహన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సంగారెడ్డి మాజీ జిల్లా అధ్యక్షులు వెంకట్రావు, అధ్యక్షులు కొంపల్లి వెంకట్‌రావు, జనరల్ సెక్రటరీ పృథ్వీ, యూనియన్ సభ్యులు హాజరయ్యారు.

◆ మూడు దశాబ్దాల పోరాట ఫలితం

సంగారెడ్డి : ఎస్సీ, ఎస్టీ ఉప కులాలను కేటగిరీలుగా విభజించొచ్చని సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడాన్ని స్వాగతిస్తున్నామని దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్లె సంజీవయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముప్పై ఏళ్ల సుదీర్ఘ కాల పోరాటానికి దక్కిన ఫలితమిదని, ఇది చరిత్రాత్మకమైన తీర్పు అని సంతోషం వ్యక్తం చేశారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించి, అట్టడుగున మగ్గుతున్న దళిత వర్గాలకు సమన్యాయం జరగాలని సాగుతున్న పోరాటానికి ఇన్నాళ్లకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు రాష్ట్రాలకు అధికారం ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఈ తీర్పుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, అందుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

రాయికోడ్(అందోల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ ప్రజలకు సూచించారు. రాయికోడ్, కుసునూర్, మాటూర్, ఇటికేపల్లి, ఖాంజమాల్‌పూర్ గ్రామంల్లో ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, ఎంపీఓ అంజలిదేవిలతో కలిసి పర్యటించారు. ప్రతీ శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు.

◆ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కంగ్టి(నారాయణఖేడ్): ముర్రుపాలే బిడ్డకు ఆరోగ్యకరం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి అన్నారు. శుక్రవారం మండలంలోని దెగుల్‌వాడీలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని సూచించారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసనం చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విశాల్, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, బాలింతలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం న్యాల్‌కల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత కుమారి అంగన్‌వాడీ కార్యకర్తలకు తల్లిపాల ప్రాముఖ్యత, సుఖ ప్రసవం, ముర్రిపాలు, పౌష్టికాహారం తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నందికండి అంగన్‌వాడీ సెంటర్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

◆ గుంతలను పూడ్చండి

సంగారెడ్డి రూరల్: కాలనీల్లో మురుగు కాలువలు నిర్మించి, రోడ్డుపై గుంతలను పూడ్చాలని 35వ వార్డు ప్రజలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ఇందిరాకాలని, ప్రశాంత్‌నగర్ వెళ్లే దారిలో మురుగు కాల్వ లీకేజీ అయి నీరు రోడ్డుపై నిలుస్తోందని వాపోయారు. దోమలు, ఈగలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. బెటర్ ఫర్ ఫోరం సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మురుగు నీటి సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. లీకేజీపై ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించకపోవడం బాధాకరం అన్నారు.

◆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జహీరాబాద్ టౌన్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. డ్రై డే పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని గడి ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రం ఉండేవిధంగా చూసుకోవాలని కోరారు. కుండీలలో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉంచకుండా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ర్ సంధ్యరాణి, ఆశా వర్కర్లు ఉన్నారు.

◆ గురుకుల ప్రిన్సిపాల్‌కు ఘనంగా వీడ్కోలు

జహీరాబాద్: బదిలీపై వెళుతున్న మండలంలోని హోతి(కె) గ్రామంలో గల బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బి.విజయకు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న సురేఖ మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాల సాధన కోసం విజయ చేసిన కృషి శ్లాఘనీయమని పేర్కొన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా విద్యార్థులను తీర్చిదిద్దారని, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించిపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో స్నేహలత, రాజ్యలక్ష్మి, కవిత, నాగయ్య పాల్గొన్నారు.

◆ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో అంగన్ వాడి కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు. గ్రామాల్లో మంచి నీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత కుమారి, సీహెచ్ఓ సుదర్శన్, దర్మెందర్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

◆ మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

కల్హేర్(నారాయణఖేడ్): అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటేశం ఆధ్వర్యంలో బీబీపేట మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, రాపర్తి మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు.

◆ అక్రమ అరెస్టులు సరికాదు

నారాయణఖేడ్: మాజీ సర్పంచ్‌ల అక్రమ అరెస్టులు సరికాదని నారాయణఖేడ్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగదీశ్వరాచారి అన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం పిలుపు మేరకు శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను నారాయణఖేడ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి లక్షలు ఖర్చుపెట్టి బిల్లులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుండంతో అసెంబ్లీ ముట్టడి పిలుపు ఇచ్చామన్నారు. పోలీసులు అరెస్ట్ చేసినవారిలో మాజీ సర్పంచ్‌లు జైపాల్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

◆ ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజలకు ఉత్తమ సేవలందించి, మంచి పేరు తెచ్చుకోవాలని జహీరాబాద్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ హుస్సెన్ అన్నారు. మండలంలో పని చేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న ఎంపీపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఎంపీపీ సమావేశ మందిరంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్, రమాకాంత్, జ్యోషి పాల్గొన్నారు.

◆ మధ్యాహ్న భోజనం అమలు చేయాలి.

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.